


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఆ రోజుల్లో...

అప్పట్లో...

హైదరాబాద్‌లోని సంగం టాకీస్ (ఇప్పటి శ్రీ మయూరి) దగ్గర 91 బస్ దిగి మా ఆర్.టీ.సీ కాలనీలోని ఇంటికి రూపాయి పెట్టి (మనిషి తొక్కే) రిక్షాలో వెళ్ళేవాళ్ళం. అమ్మమ్మ రెండు రూపాయలిచ్చి ఒక సంచి నిండా బాయిలర్‌లోకి రాక్షసి బొగ్గూ, ఇంకో సంచిలో మామూలు కుంపట్లోకి బొగ్గులూ వేయించేది. కిరోసిన్ ఆయిల్ కోసం మేమంతా క్యూల్లో నిలబడేవాళ్ళం. తరువాత గ్యాస్ కనెక్షన్ కోసం బోలెడు కష్టాలు పడటం, ఆ వంట మంచిదేనా? వాసన రాదుకదా? అని తర్కించుకోవడం కూడా నాకు లీలగా గుర్తుంది.

అమ్మ ఆర్.టీ.సీలో ఉద్యోగం చేసేది కదా! ఊరి నుండి బంధువులొస్తే ఆఫీసర్‌గారిని అడిగి కారు బుక్ చేసేది. డ్రైవర్‌తో పాటు ఇచ్చేవారు. పెట్రోల్ ఖర్చు మనది. ఆ ఎంబాసిడర్ కారు మా పాలిట పుష్పక విమానం అయ్యేది. పెద్దమ్మ కుటుంబం, మేమూ, మావయ్యా, అత్తయ్యా అందరం తొమ్మిది, పదిమందికి తక్కువకాకుండా అందులో కూరబడి, ప్రొద్దుటే లేచి అమ్మమ్మ చేసిన పులిహోరా, దద్ధోజనం, మినపరొట్టె, జంతికలూ ఇత్యాదులతో బయల్దేరి, మొదట నౌబట్ పహాడ్ (ఇప్పటి బిర్లా మందిర్) సాలార్‌జంగ్ మ్యూజియం. పన్నెండు గంటలకి గంటలు కొట్టే గడియారం ముందు పడిగాపులు పడితే అందులోంచి ఒక మనిషి బయటికి వస్తాడు అని. ఆ తరువాత అక్కడినుండి జూలాజికల్ పార్క్‌కి వెళ్ళి, జంతువులని చూసి, అలిసిపోయి భోజనాలు చేసేవాళ్ళం. ఆ తరువాత చెట్ల కింద నీడల్లో పిల్లలం ఆడుకుంటుంటే, పెద్దవాళ్ళు గానా బజానా పెట్టుకుని 'చౌదినీ క చాంద్'తో మొదలు పెట్టి అప్పటి కొత్త సినిమాలు ఏ ఆరాధన (ఎన్.టి.ఆర్)లాంటి వాటితో ముగించేవారు.

పిల్లలకి పుల్ల ఐస్‌లూ, పెద్దవాళ్ళకి చెరుకురసాలూ. హోటల్‌కి వెళితే అదీ 'గోపీ' హోటల్ అని ఉండేది రవీంద్రభారతీ, ఆల్‌ఇండియా రేడియో స్టేషన్‌ల మధ్యన. ఇడ్లీలూ, కారంపొడీ, నెయ్యీ, సాంబార్ అక్కడ ఫేమస్. ఒక్కోసారి లగ్జూరియస్‌గా 'సరోవర్' హోటల్‌కి వెళ్ళేవాళ్ళం. అక్కడ మసాలా దోశ తింటూ చుట్టూ ఉన్న కుందేళ్ళనీ, నెమళ్ళనీ చూసేవాళ్ళం.

అమ్మ పాటలు పాడేది. అందుకని రేడియోస్టేషన్ (అక్కడ గుత్తులు గుత్తులుగా రామాఫలం, చెట్లకి వేళ్ళాడేవి) అప్పుడప్పుడు రవీంద్రభారతి దర్శించేవాళ్ళం.

"పిన్నితో ఉంటే ఎన్నెన్నో కొనిపెడుతుంది.. సినిమాలు చూపిస్తుంది" అని మా పెద్దమ్మ పిల్లలు అంతా అమ్మతో ఉండడానికి ఇష్టపడేవాళ్ళు. నిజంగానే వచ్చిన సినిమాలన్నీ చూసేవాళ్ళం. నాకో అలవాటు ఉండేది. సినిమా చూసి ఇంటికి వస్తూ ఆ సినిమాని విమర్శిస్తే ఏడ్చేదాన్ని. ఆ హీరో హీరోయిన్లు నాకు అమ్మకన్నా దగ్గరయిపోయేవాళ్ళు. అంతేకాదు. మర్నాడు ఆ కథ అక్షరం పొల్లు పోకుండా మా భవానీ, మంజూ, తెల్ల చిట్టీ, క్రరిబుజ్జీ, వినోలియా ( ఈ పేరు తెల్ల చిట్టీ, క్రరి బుజ్జీ నేను పెట్టినవి కావు. వాళ్ళ అమ్మలే అలా పిలిచేవారు ఎందుకనో?) అందరికీ చెప్పేసేదాన్ని. మంచం అడ్డు పెడితే సెట్ చేంజ్.. అలా ఒక సీన్ నుండి ఇంకో సీన్ ఏక్ట్ చేసేవాళ్ళం. అదో గొప్ప థ్రిల్. డైరెక్షన్, డైలాగ్స్ నేర్పించడం నేనే. వినోలియా "నేను డాన్స్ చేస్తా" అనేది.

"ఈసా మహేసా.. అమ్మని ఒకసారి చూపరాదా.. రమ్మని నువ్వు అయినా చెప్పరాదా!" అనే పాటకీ, "తీస్కో కోకాకోలా.. వేస్కో రమ్ము సారా" అనే పాటకీ ఒకేలా డాన్స్ చేసేది.

స్కూల్లోనూ, ఇంటి దగ్గర సాధారణంగా నేనే గ్రూప్ లీడర్‌గా ఉండేదాన్ని. నా విద్యాభ్యాసం గురించి ఎంత తక్కువగా అడిగితే అంత మంచిది. డుమ్మాలు ఎక్కువ కొట్టేదాన్ని. ఎప్పుడూ కంప్లైంట్లే. పరీక్షలు మాత్రం గట్టెక్కేదాన్ని. అప్పుడప్పుడూ పాఠాలు వినేదాన్ని. పరీక్ష ముందు రోజు రాత్రి పుస్తకం తెరిస్తే అంతా గందరగోళంగా రష్యాలోనో, చైనాలోనో నన్ను వదిలేసినట్లు అనిపించేది కానీ మేనేజ్ చేసేదాన్ని.

క్రీస్తుమణీ టీచర్ దగ్గరకి అమ్మ ప్రైవేటుకి పంపించేది. ఆవిడ దుకాణానికి వెళ్ళి ఉప్పు, చా పత్తా తెమ్మనేది. దానిమీద ఒక వైపు ఐదు పైసల బిళ్ళా, ఇంకోవైపు గులాబీ పువ్వు గుర్తులుండేవి. ఆ ఖాళీ ప్యాకెట్లు మేం కలెక్ట్ చేసేవాళ్ళం. ఒకసారి వాళ్ళింటికి చుట్టాలొచ్చారు అందుకని పాపం నన్నూ సయ్యద్ హుస్సేన్ అన్నవాడ్నీ పిలిచి గుడ్లూ, ఉప్పు చేపలూ పట్టుకురమ్మంది టీచర్. మేం రిసాల్ గడ్డ మీదున్న మల్లన్న సేఠ్ కొట్టుకెళ్ళాం.

అతను లిస్ట్ బలే గమ్మత్తుగా రాసేవాడు. ఆ భాష అతనికి మాత్రమే అర్థమయ్యేది. మనం ఇంటికొచ్చి సరుకులన్నీ వచ్చాయా అని చూసుకుంటే లిస్ట్‌లో బౌ - 20 కేజీలు అని రాసేవాడు. బౌ అంటే బియ్యం. కొలగ - ఒకటి - కొలగ అంటే కోల్‌గేట్ పేస్ట్, లా - రెండు - లవ్ అంటే లక్స్ సోప్‌లు. అతని లాంగ్వేజ్ అతని భార్యకీ కొడుక్కీ కూడా బాగా అర్థమయ్యేది. చివరకి మాకు కూడా. అలా ఆ ప్రకారంగా "మల్లన్న సేఠ్... మల్లన్న సేఠ్... మల్లన్న సేఠ్" అని చెవి కోసిన మేకల్లా చుట్టూ మూగి అందరం, అతను మా వైపు చూసేదాకా అరిచి, అతను చూసాక "రెండు గుడ్లూ, ఉప్పుచాపా" అని చెప్పి, అలవాటుగా చెయ్యిపట్టేవాళ్ళం. మరమరాల ఉండో, ఆరెంజ్ పిప్పర్‌మెంటో ఆ  చేతిలో పెట్టేవాడు. అందుకే పక్కన బాలమ్మ కొట్టున్నా మేం దానికే వెళ్ళేవాళ్ళం. అది అతని మార్కెటింగ్ స్ట్రాటజీ.

నన్ను చూసి పిప్పర్‌మెంట్ ఇస్తూనే "ఉప్పుచాపా? మీ అమ్మమ్మకి తెలుసా బిడ్డా?" అన్నాడు.

సేఠ్‌కి అమ్మమ్మ అంటే సింహ స్వప్నం. ఒక్క అతనికి ఏవిటి? గడ్డ మీద రౌడీ బాకర్ భాయికి ఎంత పేరో, కాలనీలో మా అమ్మమ్మకి అంత పేరూ. ఆవిడంటే భయమూనూ.

"తెలీదు. టీచర్ తెమ్మంది" అన్నాను.

"నువ్వొద్దులే. సయ్యద్ తెస్తాడు. వెళ్ళు" అన్నాడు. అప్పట్లో ఆ గౌరవాలుండేవి.

తీరా నేనూ సయ్యద్ మావిడి తాండ్ర చీక్కుంటూ, వాడు ఉప్పుచాపా, నేను గుడ్లూ పట్టుకుని, మడి కట్టుతో కరివేపాకు కోసం అడవి వారి ఇంటికెళ్ళి వస్తున్న అమ్మమ్మకి ఎదురు పడనే పడ్డాం. ఆవిడ "ఏవిటే ఆ చేతిలో?" అంది. చెప్పాను. అంతే కత్రీనాలూ, లైలాలూ ఒకేసారి ఉప్పెనగా విరుచుకు పడ్డట్లు మా టీచరమ్మ అదిరిపడిపోయింది. ఆవిడ ఇంటికి కూతుర్ని చూసుకోడానికొచ్చిన పెళ్ళివారి ముందే ఆవిడకి అమ్మమ్మ ప్రైవేటు చెప్పింది.

'మా పిల్ల చేత ఉప్పు చాపలు తెప్పించడానికా నీ దగ్గర ప్రైవేటు పెట్టింది?' అంటూ. టీచర్ అమ్మమ్మ కాళ్ళమీద పడిపోయినంత పని చేసింది పాపం.

ఇలా చదువు సాగి, టెన్త్ అయి టైప్ కూడా అందరిలాగే నేర్చుకుని రాజుగారి ఇన్స్టిట్యూట్‌లో లోయర్ పాసయ్యాకా, ఇంటర్‌లో మా అన్నయ్య ఫ్రెండ్ అయిన ప్రభాకర్ నాకు షార్ట్ హాండ్ ట్యూషన్ మొదలు పెట్టి అది పెళ్ళి వరకూ లాగి, లాంగ్ హాండ్‌లో "మనం పెళ్ళి చేసుకుందాం" అని రాసి చూపించడం. డిగ్రీ ఫస్ట్ ఇయర్ కల్లా పెళ్ళీ, ఫైనల్ ఇయర్‌లో ఒక పిల్లవాడికి తల్లి అవడం... ఇలా జరిగిపోయింది.

ఇన్ని గుండ్రాలు గుండ్రాలు తిప్పుకుని ఇంత ఫ్లాష్ బ్యాక్ ఎందుకు చెప్పుకున్నానంటే, మా పిల్లలు పెద్దవుతుంటే కూడా నాకు ఎప్పుడూ నేను పెద్దదాన్ని అవుతున్నాను, వయసు వచ్చేస్తోంది అనిపించలేదు. అసలా భావనే నాకు కానీ నా చుట్టూ ఉండే స్నేహితులకి కానీ రాదూ, రానీయనూ. అలాంటిది మొన్న ఎవరో నా మనసులో ఈ భావన బలంగా పెట్టేసారు.

"జంగిల్ బుక్ టీ.వీ.లో వచ్చి ఇరవై రెండేళ్ళు అయింది తెలుసా?" అన్నాడు. అప్పుడు మా అశ్విన్ అది చూస్తే కానీ అన్నం నోట్లో పెట్టించుకునేవాడు కాదు.

శ్రీదేవికి ఇప్పుడు యాభై నాలుగో ఏడు అన్నాడు. నేను ఎయిత్‌క్లాసులో ఉండగా 'పదహారేళ్ళ వయసు' రిలీజ్ అయింది.

"నీ అభిమాన నటుడెవరు నీ యంగ్ ఏజ్‌లో?" అడిగాడు.

"చిరంజీవి"

"అరవై నాలుగూ!"

"ఐ లవ్ యూ రస్నా పాపకి 'అంకిత' ముప్పై పై పడివుంటాయి"

"ఐదు పైసలు, పావలాలు, రూపాయి నోటు కూడా వాడుకలోంచి వెళ్ళిపోయి పదిహేను ఏళ్ళకి పైగా అయింది. "

"నువ్వు పబ్లిక్ ఫోన్ బూత్ నుండి రూపాయి కాయిన్ వేసి ఫోన్ చేసే రోజులు పోయి.... పద్దెనిమిది సంవత్సరాలు అవుతోంది."

"నీ మొదటి కథకి ఆంధ్రభూమివాళ్ళు వేపచెట్టు (ఆత్మకథ)కి ప్రథమ బహుమతి వచ్చిందని ఎలా తెలియపరిచారు?"

"టెలిగ్రాం ద్వారా"

"ఇప్పుడు ఆ శాఖే లేదు"

"నీ పెళ్ళికి ఒక గ్రాము బంగారం ఎంత ఉండేది?"

"మూడువందలు"

"మీ పెళ్ళయిన కొత్తల్లో ఇంట్లోకి సరుకులు కొంటే ఎంతయ్యేది?"

"రెండొందలూ.... ఒక్కోసారి రెండొందల యాభై.."

"పెద్దాడికి డీ.ఏ.వీ స్కూల్లో ఎడ్మిషన్ ఎంత పే చేసారు?"

"ఐదువేలు"

"ఇప్పుడు లక్షన్నర తెలుసా?"

"నీ మొదటి కథ, నవల ఎప్పుడు పబ్లిష్ అయ్యాయి?"

"93లో"

"మొదటిగా నువ్వు రాసిన సీరియల్, సినిమా.."

"2000లో అనూహ్య ఈటీవీ వీక్లీ సీరియల్.. సినిమా రేపల్లెలో రాధ"

"ఇప్పుడు రేపల్లెలో రాధ హీరోకి నలభై ఏళ్ళు."

"ఇంక చాలు" చెప్పాను.

కమల్‌హాసన్‌నీ అమితాబ్‌నీ చిరంజీవినీ ప్రేమిస్తూ, వెన్నెల్లో ఆడపిల్లనీ, తులసీదళాన్నీ చదువుతూ అదెంత లేటెస్ట్ ట్రెండ్‌గా ఫీల్ అయ్యేవాళ్ళమో.

అంతెందుకూ? తిలకం బాటిల్ మాయం అయి ఎన్నేళ్ళయిందీ? కుంకుమా, తిలకం ప్రొద్దుటే పెట్టుకుంటే ఎండాకాలం కరిగి పారుతుండేవి. కాటుక పెట్టుకునే అమ్మాయిలు కనపడ్తున్నారా? 72లో కూడా చుడీదార్లు వాడకంలో లేవు మన రాష్ట్రంలో. మా పెద్దమ్మ కూతురు నాగ్‌పూర్ నుండి వచ్చి వేసుకుంటే, మా కాలనీలో కొత్తగా చూసేవారు. అసలవన్నీ ఎందుకు? చీరలకి ఫాల్ వెయ్యడం మన అమ్మల కాలంలో ఉందా?

మా పెళ్ళి అప్పుడు కూడా బ్యూటీ పార్లర్ అన్న మాట వినలేదు.

ఇలా మనిషి మనిషికీ చెవికో ఫోన్ వస్తుందని కల కన్నామా? లాండ్‌లైన్ ఆఫీసర్లకీ, డాక్టర్లకీ, లాయర్లకీ, ఇంకా కొంతమంది వి.ఐ.పీలకీ మాత్రం త్వరగా దొరికేవి.

ఇంక మగపిల్లల ఫ్యాషన్ల విషయానికొస్తే అలెగ్జాండర్ కటింగ్‌లూ, హీరోలకి సైడ్‌లాక్స్‌లూ, బెల్‌బాటమ్ పాంట్లూ. ఇప్పుడు పాత సినిమాల్లో హీరోలు రిషీకపూర్‌లనీ (బాబీ) చిరంజీవి (మొగుడుకావాలి) కుమార్ గౌరవ్ (లవ్‌స్టోరీ) చూస్తే... అప్పుడు అతి మోడ్రెన్‌గా స్టైల్‌గా అనిపించింది. వాళ్ళేనా అని ఆశ్చర్యం వేస్తుంది.

నాకు పదేళ్ళప్పుడు నేను మొదటిసారి బిరియానీ తిన్నాను. అప్పటిదాకా మా ఇంట్లో ఎవరికీ అదేవిటో తెలియదు.

2000వ సంవత్సరం నవంబర్ మూడున నేను మొదటిసారి విమానం ఎక్కాను. ఒక టీ.వీ సీరియల్ టైటిల్ సాంగ్ రాసాను కాబట్టి ఆ పిక్చరైజేషన్ చెన్నైలో చేస్తూ ఆ ప్రొడ్యూసర్ టికెట్ బుక్ చేసాడు. మా చిన్నాడుతో సహా వెళ్ళాను. ఎంత థ్రిల్లింగ్‌గా ఫీల్ అయ్యానో బేగంపేట విమానాశ్రయంలోకి కాలు పెట్టిన క్షణాన్ని నేను మర్చిపోలేను.

హూ! ఇవన్నీ మనం దాచలేని నగ్నసత్యాలు. మన కళ్ళముందే సినిమా హాళ్ళు అన్నీ మల్టీప్లెక్స్‌లు అయిపోవడం, పచారీ షాపులు సూపర్ బజార్లు అయిపోవడం, బట్టల దుకాణాలూ, చెప్పుల షాపులూ మాల్స్‌లోకి షిఫ్ట్ అవడం, గతంగా మిగిలిపోయిన రేడియోలు మళ్ళీ అనేక పేర్లతో ఎఫ్.ఎమ్, రెడ్ ఎఫ్.ఎమ్, రెయిన్ బో, రేడియో మిర్చీ, రేడియో సిటీ అంటూ తెగ ఊదర కొట్టేయ్యడం చూస్తున్నాం.

చిన్నప్పుడు కార్మికుల కార్యక్రమంలో ఏకాంబరం చిన్నక్కల గొంతులు వింటుంటే, తీరుబడిగా మధ్యాహ్నం కాఫీ కాచుకుని, పక్కన ఏ పకోడీలో, తంపటేసిన వేరు శనక్కాయిలో పెట్టుకుని ముచ్చట్లాడ్తూ, ప్రశాంతంగా ఉన్నట్లు అనిపించేది.

చిత్తరంజన్ గారొచ్చి 'ఈ మాసం పాట' అంటూ 'మబ్బులొచ్చినయ్.. మబ్బులొచ్చినయ్' అంటూ, గమకాలు నేర్పిస్తుంటుంటే, మబ్బులు ఆకాశం అంతా పరుచుకున్న భావన కలిగేది. ఇప్పటి రేడియో జాకీల వాగుడు హార్ట్ ఎటాక్‌లూ, హెడేక్‌లూ తెప్పిస్తాయి. ఏవిటి ఆ భాష? ఆ పలకడం? సంక్షిప్త శబ్దాలు అసలు మన పిల్లలకి తెలుసా? కుదించి రేడియోలో ప్రసారం చేసే సినిమాలు... ఈ హీరో, హీరోయిన్, మిగతా పాత్రలకి కూడా భాషా దారిద్రం డబ్బింగులూ లేని సువర్ణకాలం. "ఇది సూర్యకాంతం ... ఈ గొంతు సావిత్రిది... ఇది రావుగోపాలరావు... ఇది సత్యనారాయణ... రాజబాబు... అల్లురామలింగయ్య... జయప్రద" అని హాయిగా వాళ్ళని తలచుకుంటూ వినేవాళ్ళం.

అసలు మా కాలనీలో కేబుల్ ఆపరేటర్‌ని పిలిచి కేబుల్ కనెక్షన్ ఇప్పించింది మొదట నేనే. ప్రొద్దుట ఓ సినిమా మధ్యాహ్నం ఒకటీ, రాత్రి ఒకటీ వీ.సీ.ఆర్ లో కేసెట్లు పెట్టి ప్రసారం చేసేవాడు. కేసెట్లు ఇప్పటికీ మా ఇంట్లో చాలా ఉన్నాయి.

స్కూల్లో టీచర్‌గా పనిచేసే నేను మధ్యాహ్నాలు ఇంటికొస్తే, ఏ మల్లీశ్వరో వస్తుంటే మళ్ళీ బడికి వెళ్ళాలి అనిపించేది కాదు.

మా అమ్మ నాకు పెళ్ళైన కొత్తలో ఒక టేప్ రికార్డర్ కొని ఇచ్చింది. అది టేప్ రికార్డరే, టూ ఇన్ వన్ కాదు. అందులో పాటలు రికార్డు చేసుకుని వినేవాళ్ళం. పిల్లలు ముద్దు ముద్దుమాటలు కూడా. ఆ రికార్డర్ వినడానికి శనివారాలు మా ఫ్రెండూ, వాళ్ళాయన భోజనాలయ్యాక మా ఇంటికొచ్చేవాళ్ళు. ఎంత ప్రశాంతమైన రోజులు.

ఇంకా ఆ రోజుల్లో అందమైన విషయం ఒకటి చెప్పనా! అద్దె పుస్తకాల షాపులు. సాయంత్రం అయ్యేటప్పటికి నేను ఆ రోజు చదివేసిన పుస్తకాలు పట్టుకుని కొత్త పుస్తకాలకోసం స్పీడుగా అద్దె పుస్తకాల షాపుకి పరుగుపెట్టేదాన్ని. అప్పటికే కొత్త నవలలు ఎవరికైనా ఇచ్చేస్తే ఆ షాపు అబ్బాయితో పేచీ. ఓసారి నూనె కొనుక్కువస్తూ ఆ పుస్తకాల షాపులో ఎగిరి ఎగిరి పై ర్యాకులో పుస్తకాలు తీస్తూ ఈ నూనె అంతా ఒలకపోసేసాను. అది కాలవగా ప్రవహించే దాకా ఆ పుస్తకాల షాపు అబ్బాయీ, నేనూ కూడా చూసుకోలేదు.

లైబ్రేరీలో కార్డ్స్ ఎలాగూ ఉండేవి. అవి కాకుండా మా ఇంటి ఎదరకి మొబైలు లైబ్రేరీలు వచ్చేవి. వ్యాన్ ఆగగానే కల్పవృక్షం స్వర్గం నుండి మా ఇంటికొచ్చిందని అనిపించేది. అసలు ఈ మహా రచయితలు అందరినీ జీవితంలో చూస్తానని నేను ఎన్నడు అనుకోలేదు.

నిన్న సి.ఆనందారామంగారు "తల్లీ ఓసారి ఇంటికిరామ్మా" అని చేతులు పట్టుకుని అడుగుతుంటే, ఆవిడ 'నా కృషి కావ్యమర్థతే' చదవకుండా ఎవరూ రచయిత కాలేరు అని మా గురువుగారు వీరేంద్రనాథ్‌గారు చెప్పిన మాట గుర్తొచ్చింది. ఆవిడ దీపావళి యువలో రాసిన గృహలక్ష్మి అనే నాటకంలో పాత్రలు 'విధ్యాధరి' కమల, రఘు, కుసుమ, చిట్టి' ఇవన్నీ నేను గుర్తు చేస్తుంటే ఆవిడ మళ్ళీ అవి గుర్తుచేసుకుని నిన్న ఎంతో ఆనందించారు. అలాగే 'మీనా' ఇరవై, ముప్పై సార్లు చదివాను. ఆవిడని నా పిల్లలచేత 'అమ్మమ్మా' అని పిలిపించుకుంటున్నా, నన్ను కూతురిలా చూస్తున్న ఈవిడేనా నేను చూడాలని కలలు కన్న సులోచనారాణి అని నాకు థ్రిల్లింగ్‌గా ఉంటుంది.

ఒకసారి అల్లు అరవింద్‌గారు తన మొదటి సినిమా ప్రొడ్యూసర్‌గా 'బంట్రోతు భార్య' అని చెపితే, "అప్పుడు నాకు ఆరేళ్ళు" అంటే, "అబ్బా! అలా చెప్పి నా వయసు గుర్తు చెయ్యాలా?" అన్నారు. కానీ ఇవి గుర్తుచేసుకుంటుంటే ఎంతో మధురంగా అనిపిస్తుంటాయి.

నాతోబాటే పెరిగిన వాళ్ళందరూ పాతజ్ఞాపకాలలోకి వెళ్తారు. సన్‌లైట్ సోప్, గోల్డ్‌స్పాట్, టినోపాల్, ఫారూకీ దంత్ మంజన్, కోల్‌గేట్ (చిత్రంగా అప్పటి నుండీ ఉంది). లాంబ్రెట్టా టూ వీలర్, మర్ఫీ రేడియో, రెమీ పౌడర్, రీటా హెయిర్ ఆయిల్, అమృతాంజన్, త్రివేణీ వక్కపొడి, సింగార్ తిలకం, ఐటెక్స్ కాటుకా, శంఖం మార్కు లుంగీలూ ఇవన్నీ అందరూ గొప్పా బీదా తారతమ్యాలు లేకుండా వాడేవారు. మంగలాడు ఇంటికొచ్చి రుపాయకో అర్థకో క్షవరం చేసేవాడు. ఇలా 500, 1000 తీసుకుని కాదు.

ఆడపిల్లలు లంగా ఓణీలు వేసేవారు. ఇప్పుడూ వేస్తున్నారు సినిమాలు చూసి, అటు గాగ్రా చోలి, ఇటు ఓణీ కాకుండా ఉన్న వింతడ్రెస్‌లు. మా అమ్మమ్మ రెండున్నర మీటర్లు ఓణీకి కొనేది. ఇప్పటిలా చిన్న టవల్ లాంటి ఓణీలు కావు. కనుబొమలు కత్తిరించుకోవడాలు నాకు తెలిసి ఎనభైల ముందు లేవు. ఇప్పుడు అవి ఆడవారికి అనివార్యమట. ఎడారిలో వదిలేసినా నీళ్ళకోసం కాదు పార్లర్ల కోసం వెతుకుతారు.

'ఓ కాలమా ఇది నీ జాలమా' అని సరిపెట్టుకోవడం తప్పనిసరి. ఇంక పిల్లలు పుడితే ఏ అమ్మమ్మో, పెద్దమ్మో వచ్చి వాడికి రోజూ వంటికి నూనె రాసి మాలీష్ చేసి, సున్నిపిండితో నలుగు పెట్టి, చాదు చేసి నల్లబొట్టు పెట్టి, చేతికి పూసలు కట్టి, మొహానికి పౌడర్, మాడుకి ఆముదం పెట్టి, బాలింతకి వెల్లుల్లి కారంపొడీ, బీరకాయకూరా, పాత చింతకాయపచ్చడీ, చారూ, శొంఠిపొడితో పత్యం పెట్టేవారు. ఇవన్నీ చేస్తూ వాడు తుమ్మినా, రెండుసార్లు ఎక్కువ బయటకి వెళ్ళినా, ఏం మందు వెయ్యాలో కూడా చిట్కా వైద్యం చేసేవారు. కానీ ఇప్పుడో కడుపుతో ఉండగానే పుస్తకాలు చదువుతారు (మొగుడూ పెళ్ళాం ఇద్దరూ) అన్నీ దగ్గరుండి మొగుడే (డెలివరీ కూడా) చూసుకుంటాడు. సరే... చేసినా అన్నీ తెలిసి కేర్ తీసుకుంటే మంచిదే కానీ పిల్లలు ఏం చేసినా కంగారే .. 'ఆ' అంటే డాక్టరూ 'ఊ' అంటే మందూ.

ఇంక మా పిల్లలు మట్టిలో, దుమ్ములో పడి ఎండాకాలం శలవలు అంతా ఆడుతూనే ఉండేవారు. కానీ ఇప్పుడు మా మేనల్లుడి కొడుకు రెండో ఏడు ఇంకా రాలేదు. ఐ పాడ్‌లో కార్టూన్ పెడితే తప్ప అన్నం తినడు. ఫ్లయిట్‌లో తప్ప జర్నీ చెయ్యనివ్వడు. ఐపాడ్ వాడే ఆపరేట్ చేసుకుంటాడు.

చివరగా ఒక్కమాట. మార్పుకి నేను వ్యతిరేకిని కాదు. రుబ్బురోళ్ళనుండి గ్రైండర్‌కి రావడం, చేతులు లాగేట్లు బట్టలు ఉతకడం నుండి వాషింగ్ మెషిన్స్‌కి రావడం, పోస్ట్ కోసం వారాలూ, నెలలూ ఎదురు చూడకుండా ఈ మెయిల్సూ, సెల్‌ఫోన్సూ రావడం... ఇంట్లో కూర్చుని ప్రపంచాన్ని గూగుల్ ద్వారా గుప్పెట్లో పెట్టుకోవడం, ఎన్నో తెలుసుకోవడం.. చచ్చేటంత ఎంటర్ టైన్‌మెంట్. ఒక కాల్‌కి ఇంటికి పిజ్జా రావడం! అన్నీ నాకు చాలా చాలా ఇష్టం.

కానీ..

**విండో అంటే ఇంటికి పెట్టే కంత అనీ,**

**మౌస్ అంటే ఎలక మాత్రమే అనీ,**

**నెట్ అంటే దోమ తెర అనీ,**

**వాల్ అంటే గోడ అనీ,**

**అప్లికేషన్ అంటే పేపర్ మీద రాసే దరఖాస్తనీ**

**కీ బోర్డ్ అంటే పియానో మెట్లు అనీ,**

**ఫైల్ అంటే ఆఫీస్‌లో ముఖ్యమైన వస్తువనీ,**

**హార్డ్ డ్రైవ్ అంటే కష్టమైన దారిలో కారు ప్రయాణం అనీ,**

**కట్ అంటే..... చాకుతో కానీ కత్తెరతో కానీ కత్తిరించడం అనీ,**

**పేస్ట్ అంటే జిగురుతో అంటించడం అనీ,**

**వెబ్ అంటే సాలె పురుగు ఇల్లు అనీ,**


**వైరస్ అంటే జలుబు లేక ఫ్లూ జ్వరం లాంటిదనీ**

ఏపిల్, బ్లాక్ బెర్రీ అంటే పండ్లు మాత్రమే అనీ అనుకునే రోజుల్లో. పాపం వాళ్ళకి కుటుంబాలతో గడపడానికీ, ఆడవాళ్ళకి పిల్లలకి చిరుతిండ్లూ, వంటలూ చెయ్యడానికీ, షాపింగులు నడిచి వెళ్ళి చెయ్యడానికీ బోలెడు బోలెడు తీరికా ఓపికా ఉండేవి.

పిచ్చి రోజులు పాపం!

అవన్నీ ఓ సారి గుర్తొచ్చాయి.

Post your comments


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
ఎన్.టి.ఆర్. జాతీయ చలన చిత్ర పురస్కారం
రఘుపతి వెంకయ్య పురస్కా
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
సాహితి